స్కెచ్

# అభ్యుదయవాది

ద్రోణంరాజు కృష్ణమోహన్

ఇంతకూ రంగారావుకు అదృష్టం కలిసొచ్చింది గాబట్టి త్వరలోనే పార్లమెంటు సభ్యుడు కాబోతున్నాడు రంగారావు పెద్ద కాపిటలిస్టుగాదు, ప్రొలిటేరియట్‌గాదు. చిన్న రకం ధనికుడని చెప్పవచ్చు. అయితే కొద్దో గొప్పో రాజకీయ చరిత్ర కూడా వున్నది. 1942 లో జైలుకెళ్ళాడు. 1944 లో అభ్యుదయ ప్రకటన ఒకటి చేసివచ్చి కమ్యూనిస్టుగా 1948 వరకు దీక్షతో పనిచేశాడు. తెలంగాణా దెబ్బతో బయటకొచ్చేసి పార్టీ రాజకీయాలతో బంధం త్రెంపుకుని పిత్రార్జితం కొద్దిగా అమ్ముకుని బస్తీలో మంచి సెంటర్‌లో హెూటల్, బట్టల దుకాణం పెట్టాడు. పదెకరాలు మిగిలితే చట్టాలొస్తాయని భయపడి తమ్ముడిని దింపాడు. రెండూ జోరుగా సాగుతున్నాయి. అప్పుడే పెద్ద డాబాఇల్లు కట్టేశాడు. కాస్త పలుకుబడి సంపాదించాడు. ఒక పాతికముప్పై వేలు వెనకేశాడు. కౌన్సిలరుకూడా అయ్యాడు. ఛెయిర్మన్ ఛాన్సు కొద్దిలో పోయింది. అయినా ప్రయత్నాలు సాగుతూనేవున్నాయి అటువంటి రంగారావుకు యీసారి ఎలక్షన్లు ఎందుకో ఆకర్షించాయి. నియోజక వర్గం బలాబలాలు పరీకించాడు కాంగ్రెసు—కమ్యూనిస్టు మధ్య ఏ ఒక్కరు కాస్త పలుకుబడి కలిగినవాళ్ళు నిలబడ్డా ఏ వెయ్యోవోట్లు చీలినా రెండు పక్షాలకూ ప్రమాదమే ఇది బాగానే వుందనుకున్నాడు.

"తెలుసుగా ప్రమాదం" కదిపి చూశాడు జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడని.

"అ.... తెలియకేంగాని ..." గొణిగాడు నరసయ్య.

"మరయితే కులాభిమానం కూడా ఎక్కువ పనిజేస్తుందని గ్రహించండీ." అదో పెద్ద హెచ్చరిక.

"అయితే కమ్యూనిస్టు గెలుస్తాడంటావా?" అడిగాడు నరసయ్య.

"గెలవ్వచ్చు - చీల్చే సమర్థుడు లేకపోతే." ఆ సామర్థ్యం తనలో ఉన్నట్లు!

"నువ్విదివరకు పార్టీలో వున్నప్పుడు కూలి జనందగ్గిర కాస్త పలుకుబడి సంపాదించి నట్లున్నావ్!"

"మరి?" సందేహ మెందుకన్నట్లు ప్రశ్నించాడు రంగారావు.

"ఏదో కౌన్సిల్ కంటే ఇచ్చారుగాని నీకు, పార్లమెంటు కంటే ప్రజలిస్తారా వోట్లు?" నరసయ్య నవ్వాడు.

"సరే అక్కర్లేకపోతే."

"చూద్దాంలే. టైముందిగా. అయినా ఇది వరకల్లా కమ్యూనిస్టువి. తరువాత కూడా కాంగ్రెసులో మళ్ళీ చేరలేదు నీకెలా ఇవ్వడమా అని ఆలోచిస్తున్నాను."

"వీలయితేనే చూడండి" పెద్ద మనిషి తరహాగా అన్నాడు.

* * *

కమ్యూనిస్టు మిత్రుల్ని కలుసుకున్నాడు రంగారావు.

"మా ఖర్మ నువ్వు తగిలావ్ మాకు" విసుక్కున్నాడు, జిల్లా పార్టీ కార్యదర్శి జానకి రామయ్య.

"ఏం, నేను ఏనాడయినా పార్టీమీద తప్పుడు ప్రచారం చేశానా? బయటికొచ్చి గప్‌చిప్‌గా వున్నాను. నాలో అభ్యుదయ భావాలు లేవనా! ఆ రాఘవయ్యని గనుక నిలబెడితే చచ్చినా గెలవడు. నేను ఖాయంగా చెపుతా. కులాభిమానాలు కూడా పనిచేస్తాయి." హెచ్చరించాడు.

"దాదాపు రెండువేల వోట్లు తగ్గుతాయేమోనని అనుమానంగా వున్నది, ముఖాముఖి పోటీ అయితే. ఆ రెండువేలు మా పార్టీకి రావాలి. ఎవరు సమర్థుడా అని చూస్తున్నాం"

"నే చెప్పింది ఆలోచించు."

"నీ రెండు వేలు ఖాయమేమిటి! నిన్ను నుంచోపెడితే, పార్టీలోనే కొందరికి మంటగా వుంటుంది. అహోరాత్రాలు పార్టీకి పనిచేస్తూ నానా అవస్థలు పడేవాళ్లుండగా నిన్ను బలపరిస్తే, పాపం వాళ్ల గతేంకాను! ఆ రాఘవయ్య నుంచుంటానని గోలపెడుతున్నాడు. అతనికి వ్యక్తిగతంగా కూడా చాలా పలుకుబడి వున్నది. కొంపతీసి ప్రచ్ఛన్నంగా దెబ్బ తీయించాడంటే మాత్రం మాపని ఫైసలా."

"అఁ....పార్టీలో వుంటూ ఎలా చేస్తాడులే! ఈ మాత్రానికి పార్టీనుంచి బయటికి పోవచ్చాడా! నేను పార్టీ టిక్కెట్టుకు తగనా! అభ్యుదయవాదిని కానా?"

"నీ అభ్యుదయం ఎవడిక్కావాలిక్కడ- కాంగ్రెసువాడు ఎలా వోడిపోతాడా అని ఎదురు చూస్తుంటే మేము! ఎవరితోనయినా సరే కలుస్తాం. మాపని కావాలి. ధైర్యం లేకపోతే మాత్రం నిలవం. అది ఖాయం."

"అయితే నేను స్వతంత్రుడుగా పారేస్తాను."

"సరే పడెయ్యి. అప్పుడే చూద్దాం."

* * *

పరిస్థితుల ప్రభావంవలన, ధైర్యంలేక పోవడంవలన, కమ్యూనిష్టుపార్టీ పోటీనుంచి విరమించుకొని, స్వతంత్ర అభ్యర్థి అభ్యుదయవాది అయిన రంగారావును బలపరచ నిశ్చయించింది. ఈవార్తపడ్డ మరునాడే పత్రికలో యీ క్రిందివార్త కూడా పడింది.

"నియోజకవర్గంలో పార్టీ ఎంతో బలంగా వున్నప్పటికీ వెయ్యి వోట్లకు ఆశపడి ఒక చిన్న రకం కాపిటలిస్టును బలపరచాలని నిశ్చయించి పార్టీ మూలసూత్రాలను వ్యతిరేకించింది గాబట్టి పార్టీనుంచి రాజీనామానిస్తూ స్వతంత్రుడుగా పోటీ చేస్తున్నట్లు రాఘవయ్యగారు ప్రకటిస్తున్నారు."

రంగారావు బేజారైపోయాడు ★

---

(31 వ పేజీ తరువాయి)

చిలకమర్తివారి చెవిటి ప్రహసనా లెన్నో చదివి ఆనందించాం. రోజూ మన మధ్య ఎందరెందరో చెవిటివారు తిరుగుతూఉంటారు. వారితో మనం పడేబాధ ఇంతా అంతా కాదు కొందరికి బొత్తిగా వినపడదు—చివరికి మేళతాళాలు వాయించినా వినపడదు. వీరివల్లనే "చెవిటివారి ముందు శంఖ మూదినట్లు" అనే సామెత వచ్చింది.కొందరికి అంత అన్యాయంగా ఉండదు;కొంచెం పెద్దగా చెబితేచాలు.కొందరికి పెద్దగా చెబితే వినపడదు. మరి కొందరికి మెల్లిగా చెబితే వినపడదు. కొందరు వినపడకపోయినా "ఓ ఐసీ!" అనో,"అలాగా?" అనో,"వెరీగుడ్" అనో అనేసి,పెద్దగానవ్వి, తమంతటతామే అనర్గళంగా మాట్లాడుతారు. ఎదుటి మనిషి వీరు చెవిటివారు అని కనుక్కుంటారేమోనని, కప్పిపుచ్చటానికి నానాబాధా పడతారు. అటువంటప్పుడు ఉంటుంది తమాషా!

చెవుడు శ్రవణనాడి జబ్బులవల్లనో, మధ్య చెవి వ్యాధి వల్లనో కలుగుతుంది. నరం జబ్బు వల్ల గలిగే చెవుడు నయంకాదు ఇతర కారణాలవల్ల కలిగితే, తగ్గటానికి అవకాశం ఉంది కొన్ని రకాల చెవుడుకు చెవి ఆపరేషన్‌చేస్తే నయమవుతుంది దీన్ని లెంపర్ట్ ఆపరేషను అంటారు. ఈ ఆపరేషను చెయ్యగలవారు బహు కొద్దిమంది. నారదరావు పట్నంనుంచి ఒక మర కొనుక్కొచ్చి చెవిలో పెట్టుకున్నాడు అది చెవిలో పెట్టుకుంటే చెవిటివాళ్లకు కూడా మామూలుగానే వినపడుతుంది. శరభరాజు అంత డబ్బు లేక, ఒక రబ్బరు గొట్టానికి రేకు గరాటును తగిలించి, గొట్టాన్ని చెవిలో పెట్టుకుని గరాటులో మాట్లాడమంటాడు. రంగశాయి చెవిటివాడే అయినా, మంచి తెలివిగలవాడు. ఎదుటి మనిషి పెదవుల కదలికనుబట్టి విషయాలన్నీ గ్రహించుకోగలడు.